రైతులకు రుణమాఫీ అందాలి

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన రైతులకు రుణమాఫీ పథకం అందేలా బ్యాంకులు, సహకార సొసైటీ బ్యాంక్‌ అధికారులు చర్యలు తీసుకోవాలని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం వీసీ మీటింగ్‌ హాల్‌ నుంచి వ్యవసాయ, వివిధ బ్యాంక్‌ అధికారులతో కలసి రైతు రుణమాఫీ పథకం కార్యక్రమంపై తీసుకోవలసిన చర్యలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ... జిల్లాలో 2018 డిసెంబర్‌ 12 తర్వాత మంజూరైన లేక రెన్యువల్‌ అయిన పంట రుణాలకు 2023 డిసెంబర్‌ 9 నాటికి బకాయి ఉన్న పంట రుణాలు తీసుకున్న రైతులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 2,667 మంది రైతు కుటుంబాలకు రూ.12.53 కోట్ల రుణ మాఫీ పథకం అందజేయడం జరిగిందన్నారు. క్రాప్‌లోన్స్కు అర్హులైన వారికి మొదటి విడతలో లక్ష రూపాయలు రైతు ఖాతాలో రెన్యువల్‌ చేయాలని కలెక్టర్‌ అన్నారు. రెండవ విడత రూ. 1.50 లక్షల వరకు, మూడో విడత రెండు లక్షల వరకు దశలవారీగా రుణమాఫీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతు రుణమాఫీ పథకం పై రైతులకు సందేహాలు ఏమైనా ఉంటే జిల్లాలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో (గ్రీవెన్స్‌ సెల్‌) ఏర్పాటు చేసి రైతులకు సంబంధిత అధికారులు నివృత్తి చేయాలన్నారు. వ్యవసాయ ,బ్యాంక్‌ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మొదటి విడత లో రెన్యువల్‌ కాని వారు, రెండవ, మూడవ విడతలలో రెన్యువల్‌ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక ప్రత్యేక నోడల్‌ అధికారిని నియమించి రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తూ.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రాప్‌ లోన్‌ రెన్యువల్‌ విషయంలో ఎలాంటి పొరపాటు లేకుండా చూడాలని బ్యాంక్‌ అధికారులకు ఆదేశించారు. రుణమాఫీ కోసం వచ్చే రైతులకు పూర్తిగా సహకరిస్తూ.. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రేఖ మేరీ, ఎల్డీఎం శ్రీనివాసులు, బ్యాంక్‌ మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



రైతు రాజ్యమే ప్రభుత్వ లక్ష్యం


రాయిలాపూర్‌ రైతు వేదిక వద్ద రైతులు, కాంగ్రెస్‌ నేతలు, అధికారులు


మొక్కలు నాటుతున్న నాయకులు, రైతులు

- రుణమాఫీతో రైతు వేదికల వద్ద రైతుల సంబరాలు
- రాయిలాపూర్‌లో రైతులతో కాంగ్రెస్‌ నేతల సంబరాలు

మేడ్చల్‌: రైతు సంక్షేమమే ఎజెండాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం రైతు రాజ్యం సాధించడమేనని నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇంచార్జ్‌ తోటకూర వజ్రేష్‌యాదవ్‌ అన్నారు. రైతు రుణమాఫీ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం కార్యక్రమాన్ని మండలంలోని రాయిలాపూర్‌ రైతు వేదిక వద్ద ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన అధికారులు, రైతులు, కాంగ్రెస్‌ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పి అమలు చేస్తున్నారని అన్నారు. అగస్టు 15 లోపు రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ అవుతుందన్నారు. చరిత్రలో ఏప్పుడూ లేని విధంగా రైతులకు రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్‌ ప్రభుత్వంకు దక్కుతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి రైతులతో కలిసి పాలతో అభిషేకం చేసి సంబరాలు జరుపుకొన్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో రైతు వేదికల వద్ద రైతులు, కాంగ్రెస్‌ నాయకులు, వ్యవసాయాధికారులు కలిసి రుణమాఫీ ప్రకటన తర్వాత సంబరాలు చేసుకున్నారు. రైతు వేదికల వద్ద నాయకులు, రైతులు మొక్కలు నాటారు. పీఏసీఎస్‌ చైర్మన్‌లు రందీప్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు రమణారెడ్డి, మల్లేష్‌గౌడ్‌ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నరేందర్‌, మండల వ్యవసాయాధికారి అర్చన, ఏఈఓ సుమిత తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్‌ కలెక్టర్‌

శామీర్‌పేట్‌: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు వేదికల్లోని వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రైతులతో నేరుగా మాట్లాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శామీర్‌పేట మండలం, అలియాబాద్‌ చౌరస్తాలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌, జిల్లా స్థాయి అధికారులు, స్థానిక నాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


అలియాబాద్‌లోని రైతు వేదిక వద్ద జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌...

అర్హులందరికీ రుణమాఫీ: అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి

కీసర: ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పథకం వర్తింపచేయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కీసర రైతు వేదికలో రైతు రుణమాఫీ 2024 నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంట రుణమాఫీ జమ చేసే కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం, లబ్ధిదారులతో ముఖాముఖి (వీడియో కాన్ఫరెన్స్‌) కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ... రుణమాఫీ 12–12–2018 నుంచి 9–12–2023 మధ్యకాలంలో తీసుకున్న రుణాలకు వర్తిస్తుందన్నారు. కీసర మండలంలో మొదటి విడతలో 556 మంది రైతులకుగాను రూ. 2.66 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేశారన్నారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ రామిడి ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ, తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌, ఎంపీడీఓ గ్యామ, మండల వ్యవసాయాధికారి మాధవీలత, విస్తరణ అధికారులు వందన, రాజ్‌కుమార్‌, మండల రైతులు, కాంగ్రెస్‌ నేతలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


కీసరలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌ నేతలు

కీసర: కాంగ్రెస్‌ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని మరోసారి రుజువైందని కీసర మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామిడి విజయ్‌రెడ్డి అన్నారు. గురువారం పంట రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా మండల కేంద్రమైన కీసరలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల ముందు రాహుల్‌ గాంధీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఒకేసారి 2 లక్షల వరకు పంట రుణమాఫీ పథకాన్ని అమలు చేసి దేశ చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయారన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ పన్నాల బుచ్చిరెడ్డి, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, ముప్ప రామారావు, కౌన్సిలర్లు గోగుల సరితావెంకటేష్‌, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్‌ నేతలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి, సామల శ్రీనివాస్‌రెడ్డి, బెలిదే రమేష్‌గుప్తా, జంగయ్యయాదవ్‌, శ్రావన్‌కుమార్‌గుప్తా, దయానంద్‌, కృష్ణారెడ్డి, ముద్దం వెంకటేష్‌, తటాకం అభిలాష్‌, శోమేశ్‌, గౌస్‌బాయ్‌, సంజీవరెడ్డి, జంగయ్య యాదవ్‌, సత్తిరెడ్డి, ఎట్టమయ్య, సత్యం సాగర్‌, అరుంధతీ తదితరులుపాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మేడ్చల్‌: పట్టణంలోని 11వ వార్డులోని ఇందిరానగర్‌ లో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేడ్చల్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దీపిక నర్సింహారెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్‌ సుహాసినితో కలిసి ఆమె నిర్మాణ పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. పట్టణంలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న చైర్‌ పర్సన్‌, కౌన్సిలర్‌

సందడిగా వన మహోత్సవం


మొక్కలు నాటుతున్న వీసీ శ్రీకృష్ణదేవరావు

శామీర్‌పేట్‌: శామీర్‌పేటలోని నల్సార్‌ యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ వైస్‌ చాన్సలర్‌ శ్రీకృష్ణదేవరావు ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జవహర్‌నగర్‌లోని సీఆర్‌పీఎఫ్‌ పాఠశాల విద్యార్థులు, సీఆర్‌పీఎఫ్‌ అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్రస్తుత పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు సెలవుల్లో ఉండటం తగదు
- ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో మేయర్‌ శాంతి అధ్యక్షతన గురువారం అత్యవసర కౌన్సిల్‌ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ... జవహర్‌నగర్‌లో పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. సీజనల్‌ వ్యాధులు సంభవించే కాలంలో అధికారులు సెలవులు పెడుతూ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని, అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా జవహర్‌నగర్‌లో గంజాయి, కుక్కల బెడదతో ప్రజల్లో అభద్రతాభావం పెరుగుతుందన్నారు. బోనాల పండుగకు రూ. 30 లక్షలు, ప్రతి కాలనీలో కుక్కల బెడదను తగ్గించేందుకు రూ. 50 లక్షలు నిధులు కేటాయించాలని తెలిపారు. జవహర్‌నగర్‌లో మరోసారి పాదయాత్ర చేసి సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. కమిషనర్‌ తాజ్‌మోహన్‌రెడ్డి, ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్‌, డిప్యూటీ మేయర్‌ శ్రీనివాస్‌, మాజీ మేయర్‌ కావ్య, కార్పొరేటర్లు, కోఆప్షన్‌ సభ్యులు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్‌ శాంతి

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కీసర: కాంగ్రెస్‌ పార్టీ తన మేనిఫెస్టో ద్వారా ముదిరాజు కులస్తులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర యూత్‌ ఉపాధ్యక్షుడు మోర రవికాంత్‌ డిమాండ్‌ చేశారు. గురువారం తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ కీసర మండలం శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని డిమాండ్‌ చేస్తూ కీసర తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముదిరాజుల చిరకాల వాంఛ అయిన బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్పు అతి త్వరలో చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని ఇందు నిమిత్తం బీసీ కమిషన్‌కు తగిన ఆదేశాలను జారీచేయాలని కోరారు. ముదిరాజ్‌ సంక్షేమ సంఘం నేతలు రాగుల అశోక్‌ ముదిరాజ్‌, ఏలూరి శ్రీనివాస్‌, ఆనబోయిన జంగయ్య, బంగారం సత్యనారాయణ, నాయకపు గంగారం, పుట్టరాజు, రాగుల రమేష్‌, చిక్కుడు రమేష్‌, పండుగ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.


కీసర తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌ కులస్థులు

దివ్యాంగులకు మీ సేవ కేంద్రాలు కేటాయించాలి

సాక్షి, సిటీబ్యూరో: దివ్యాంగులకు కూడా మహిళా సంఘాలకు కేటాయించినట్లుగా మొదటి ప్రాధాన్యత కింద మీ సేవా సెంటర్లు ఏర్పాటు చేసుకునేందుకు రుణ సదుపాయం కల్పించాలని దివ్యాంగుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్‌.వినయ్‌ కోరారు. 5 శాతం ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. గురువారం డీఆర్‌ఓ హరిప్రియను కోరారు. వై.రాము తదితరులు పాల్గొన్నారు.

పశువుల స్వాధీనం

ఘట్‌కేసర్‌: క్రూరంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఘట్‌కేసర్‌ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... యంనంపేట్‌ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బీబీనగర్‌ నుంచి హైదరాబాద్‌ వైపు క్రూరంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన డీసీఎం డ్రైవర్‌ నేనావత్‌ రాజు(20)ను అదుపులోకి తీసుకొని విచారించగా ఒరిస్సాలోని నవరంగ్‌పూర్‌లో సభావత్‌ విజయ్‌ వద్ద పశువులను కొని డీసీఎంలో బహదూర్‌పురా కబేళాకు తరలిస్తున్నట్లు తేలింది. నెంబర్‌ ప్లేట్‌ మార్చి డీసీఎం తిప్పుతున్నట్లు గుర్తించారు. 39 ఆవులు, 29 ఎద్దులను జియాగూడ గోశాలకు తరలించారు.

25 బర్రెల స్వాధీనం

పోచారం: పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోచారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌ రాజు సమాచారం మేరకు... గురువారం అన్నోజిగూడలోని డీమార్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా క్రూరంగా పశువులను తరలిస్తున్న వాహనం చిక్కింది. జనగాం జిల్లా లింగాల ఘనపూర్‌కు చెందిన వాహన డ్రైవర్‌ ఎండీ అఫ్రద్‌ (23)ను అదుపులోకి తీసుకొని వాహనంతో పాటు 25 బర్రెలను స్వాధీనం చేసుకున్నారు.

కుక్కల దాడిలో బాలుడి మృతి బాధాకరం

- బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం
- ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి


బాధిత కుటుంబ సభ్యులకు వీడియోకాల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలో జరిగిన కుక్కల దాడి జరిగిన స్థలాన్ని గురువారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పరిశీలించారు. మృతిచెందిన బాలుడు విహాన్‌ కుటుంబసభ్యులతో వీడియోకాల్‌ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాలుడు విహాన్‌ను కుక్కలు తినడం యావత్‌ సమాజాన్ని కంటతడి పెట్టిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబసభ్యులకు అండగా ఉంటామన్నారు. జవహర్‌నగర్‌లో కుక్కల నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు కార్యచరణ ప్రారంభించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు మాజీ మేయర్‌ మేకల కావ్య రూ. 20 వేలు, కార్పొరేటర్‌ నిహారిక గౌడ్‌ రూ. 10 వేలు అందచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, సంగీతరాజశేఖర్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షులు కొండల్‌ ముదిరాజ్‌, నాయకులు సింగన్న బాలరాజు, ప్రసాద్‌, నర్సింహయాదవ్‌, సాదిక్‌, రాజు, రఫీక్‌, మహేష్‌, మహేందర్‌యాదవ్‌, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ కాదు.. పరిహారం అందించాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌

జవహర్‌నగర్‌: ముఖ్యమంత్రి పరామర్శ కాదని బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. మేడ్చల్‌ జిల్లా జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లో వీధి కుక్కల దాడికి బాలుడు మృతి చెందిన ఘటనా స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ... ఇక్కడున్న పేదలపై ప్రభుత్వానికి పట్టింపులేదని, మున్సిపల్‌ అధికారులు, పోలీసులు, మరోవైపు రెవిన్యూ అధికారులు చిన్నచూపు చేస్తున్నారని మండిపడ్డారు. జవహర్‌నగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలను స్థానికులకు కేటాయించాలని, నగరంలో ఎక్కడో నివసిస్తున్న వారికి ఇక్కడ ఇండ్లను కేటాయించడం సరైన పద్ధతి కాదన్నారు.

కుక్కలు, గంజాయి బ్యాచ్‌కు అడ్డా...

వీధి కుక్కలకు, గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా జవహర్‌నగర్‌ మారిందని ఎంపీ ఈటల ధ్వజమెత్తారు. జవహర్‌నగర్‌లో ప్రభుత్వం అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ జిల్లా రూరల్‌ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రంగుల శంకర్‌, బీజేపీ జవహర్‌నగర్‌ అధ్యక్షుడు కమల్‌, నాయకులు మహేందర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కన్న తల్లి లాంటిది: ఎంపీ ఈటల

మేడ్చల్‌రూరల్‌: చెట్టు కన్న తల్లి లాంటిదని, దాని సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నిర్వహించిన వన మహోత్సవంలో మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోడీ అమ్మ పేరిట మొక్కలు నాటాలని సంకల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, కమిషనర్‌ శ్రీహరి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారి మృతి దారుణం...

జవహర్‌నగర్‌, బాలాజీనగర్‌ ప్రాంతాలకు వలసవచ్చి దుర్గంధం నడుమ, చిన్న గుడిసెల్లో జీవించే పేద కుటుంబాల పిల్లలు కుక్కల దాడిలో మరణించడం అత్యంత దారుణమని, యావత్‌ మహిళా లోకం కన్నీరు పెట్టుకుంటుందని ఎంపీ ఈటల అన్నారు. పాలకమండళ్లు, ప్రభుత్వ అధికారులు ఉన్నా అక్కడ బెల్టుషాపులతో తాగుబోతుల అడ్డాగా మారిందన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి...

ఎన్నికల సమయంలో ఎలాంటి నిబంధనలు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పారో అదే విధంగా చేయాలి తప్ప అనేక రకాల నిబంధనలు పెట్టి అందరికీ ఎగరగొట్టే ప్రయత్నం చేయవద్దని ఎంపీ ఈటల అన్నారు. రూ. 34 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భేషజాలను పోకుండా హామీ ఇచ్చిన మేరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేయాలని కోరారు.

అంతా రెడీమెడ్‌: ఎమ్మెల్యే మల్లారెడ్డి

గుండ్లపోచంపల్లిలో వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి కాసేపు ఈటలతో సరదాగా మాట్లాడి ఆసక్తికర వాఖ్యలు చేశారు. అన్నా నేను నీ లాగా నేను పనిచేసి రాలే.. అంతా రెడీమెడ్‌ నాది అన్నారు. రాజకీయం చేయకండి.. ప్రజలకు సేవ చేయాలనే తాను పాలిచ్చా, నీళ్లు, పూలిచ్చినం, అన్ని ఇచ్చినం.. ఇప్పుడు మీరు కేంద్రం నుంచి నిధులు తేవాలి, డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు తేవాలి, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలి అంటూ నవ్వులు పూయించారు.


గుండ్లపోచంపల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

జవహర్‌నగర్‌: దేశ చరిత్రలోనే రైతు రుణమాఫీ చరిత్రాత్మక ఘట్టమని, రైతే రాజుగా తెలంగాణ ప్రభుత్వం పరిచేస్తోందని కాంగ్రెస్‌ పార్టీ జవహర్‌నగర్‌ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌ అన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో ఆ పార్టీ జవహర్‌నగర్‌ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌ ఆధ్వర్యంలో అంబేద్కర్‌ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మేయర్‌ దొంతగాని శాంతి, డిప్యూటీ మేయర్‌ శ్రీనివాస్‌, కార్పొరేటర్లు, కోఆప్షన్‌ సభ్యులు, మాజీ సర్పంచ్‌ శంకర్‌గౌడ్‌,సదానంద్‌, వినయ్‌కుమార్‌, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్‌, అనంతలక్ష్మి, రజితగోపాల్‌ పాల్గొన్నారు.

రుణమాఫీ దేశానికే ఆదర్శం

ఘట్‌కేసర్‌: రైతులకు రుణమాఫీ చేసిన తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని జిల్లా పరిషత్‌ మాజీ చైర్మన్‌ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. గురువారం ప్రతాపసింగారంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ–2024 నిధుల విడుదల కార్యక్రమాన్ని కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని ఆయన విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతు రాజ్యమే కాంగ్రెస్‌ పార్టీ లక్ష్యమన్నారు. ఘట్‌కేసర్‌ మండలంలో సుమారు 1200 మంది రైతులు రుణమాఫీ పొందుతున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, సింగిల్‌ విండో చైర్మన్‌ రామిరెడ్డి, వైస్‌ చైర్మన్‌ అనంతరెడ్డి, తహసీల్దారు సీఎస్‌ రజిని, ఎంపీడీఓ గీతారెడ్డి, ఏఓ బాసిత్‌, మాజీ వైస్‌ ఎంపీపీ కర్రె జంగమ్మ, సింగిల్‌ విండో డైరెక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, ఉదయ్‌ కుమార్‌రెడ్డి, కార్యదర్శి కవితా యాదవ్‌, ఏఈఓ జగదీష్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్‌, రైతులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో మెరుగైన వసతులు కల్పించాలి


బోడుప్పల్‌ మేయర్‌ను కలిసిన కీసరగుట్ట ఆలయ చైర్మన్‌

కీసర: బోడుప్పల్‌ మేయర్‌గా నియమితులైన తోటకూర అజయ్‌ యాదవ్‌ను గురువారం కీసరగుట్ట దేవాలయ చైర్మన్‌ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌ యాదవ్‌, మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ మాట్లాడుతూ... కీసరగుట్ట దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగుచర్యలు చేపట్టాలని సూచించారు. కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఫౌండర్‌ ఫ్యామిలీ సభ్యులు తటాకం రమేష్‌, తటాకం వెంకటేష్‌, తటాకం లక్ష్మణ్‌, తటాకం అభిలాష్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కీసర: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలతో చదువుకొని జీవితంలో ఎదగాలని శ్రీ శారదాంబ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జయంతి రామకృష్ణ అన్నారు. గురువారం నాగారం సెరినిటీ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ గ్రేడులు సాధించిన 8 మంది విద్యార్థులకు శ్రీ శారదాంబా బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సహకంగా నగదు, మెమెంటోలు, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి కాజ గంగాధరావు, సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్‌ నోముల జంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను సహించం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తప్పవని నాగారం మున్సిపల్‌ కమిషనర్‌ రాజేంద్రకుమార్‌, టీపీఓ కావ్య హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి రెవెన్యూ పరిధిలో, నాగారంలో అక్రమంగా నిర్మిస్తున్న 6 భారీ షెడ్లతోపాటు, మరొక బిల్డింగ్‌ నిర్మాణ పనులను జేసీబీ సాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపల్‌ పరిధిలో నిర్మాణాలకు తప్పకుండా మున్సిపాలిటీ నుంచి అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. మున్సిపల్‌ నుంచి అనుమతులు తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధం నిర్మాణాలను చేపడితే ఆ నిర్మాణాలను కూల్చివేయడంతోపాటు, సదరు యజమానులపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

డ్రగ్స్‌ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్‌రూరల్‌: యువత డ్రగ్స్‌, మత్తు పదార్థాల బారిన పడకుండా వాటి నిర్మూలనకు తమవంతు చిత్తశుద్ధితో కృషి చేయాలని పేట్‌ బషీరాబాద్‌ ఏసీపీ రాములు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో గురువారం డ్రగ్స్‌ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... డ్రగ్స్‌ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వారితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులో ప్రతిజ్ఞ చేయించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ఆంజనేయులు, పేట్‌ బషీరాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ విజయవర్ధన్‌, డీఐ నర్సింహ్మారాజు, ఎస్‌ఐ ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఏసీపీ రాములు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387